ఆర్‌డిఒను కలిసిన వైద్యులు

ప్రజాశక్తి - నరసాపురం

స్థానిక ఏరియా ఆసుపత్రి వైద్యులు ఆర్‌డిఒ దాసి రాజును గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆర్.సుప్రియ వైద్యులతో కలిసి ఆర్‌డిఒకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ దాసి రాజు మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించాలని వైద్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు జెట్టి గణేష్, కె.రామకృష్ణ, భారతి తదితరులు పాల్గొన్నారు.

దాసిరాజుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న వైద్యులు

భీమవరం పురపోరు ఎప్పుడో..!

మున్సిపల్ ఎన్నికల నిర్వహణ ఇప్పట్లో కష్టమే
గ్రామాల విలీన ప్రతిపాదనే అడ్డంకి
కార్పొరేషన్ కోసం ఎదురుచూపేనా?
కోర్టు కేసులు పరిష్కారమైతేనే ఎన్నికలు

ప్రజాశక్తి - భీమవరం

భీమవరం మున్సిపల్ ఎన్నికలు కలలానే మిగిలిపోతున్నాయి. పట్టణంలో సమీప గ్రామాల విలీనమే దీనికి అవరోధంగా మారింది. ఈ సమస్యలు కోర్టులో ఉండటంతో ఇటు విలీన ప్రక్రియ జరగదు.. అటు ఎన్నికలు జరగవు అన్నట్లుగా పరిస్థితి తయారైంది. దీంతో మున్సిపల్ ఎన్నికల నిర్వహణ ఇప్పట్లో కష్టంగానే కన్పిస్తోంది. అయితే భీమవరం కార్పొరేషన్ అవుతుందనే ఆశ కూడా ఎదురుచూపుగానే మిగిలింది. అయితే అటు కోర్టులో ఉన్న కేసులు పరిష్కారం కావడమే కాకుండా ఇటు విలీన ప్రక్రియ కూడా సజావుగా సాగితేనే మున్సిపల్ ఎన్నికలు జరిగేందుకు ఆస్కారం లభిస్తుంది. లేకపోతే లేనట్లే. ఇదే పరిస్థితి జిల్లాలోని తాడేపల్లిగూడెం, తణుకు, పాలకొల్లు మున్సిపాల్టీల్లోనూ నెలకొంది.

భీమవరంలో మున్సిపల్ ఎన్నికలకు బ్రేక్ పడిన తర్వాత నుంచి ఇప్పటి వరకు రెండు సార్వత్రిక ఎన్నికలు జరిగినప్పటికీ మున్సిపల్ ఎన్నికలు మాత్రం జరగలేదు. భీమవరం పట్టణంలో సమీప గ్రామాల విలీనమే ఎన్నికలకు అవరోధంగా మారింది. గ్రామాల విలీనం ప్రతిపాదనకు 1997 నుంచి చుక్కెదురవుతూనే ఉంది. అయినా భీమవరం పట్టణంలో సమీప గ్రామాలను విలీనం చేసేందుకు గత ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2019 జూన్ 19న గత మున్సిపల్ పాలకవర్గం పదవీకాలం ముగిసింది. ఇక మున్సిపల్ ఎన్నికలకు అందరూ సిద్ధమయ్యే తరుణంలో గ్రామాల విలీనానికి 2020 డిసెంబర్‌లో గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. తాడేరు, చినఅమిరం, రాయలం, కొవ్వాడ అన్నవరం గ్రామాలను విలీనం చేస్తూ భీమవరం పట్టణంలో వార్డుల విభజన, జనాభా ప్రాతిపదికన ఎన్నికలకు రిజర్వేషన్లను నిర్ణయించారు. గతంలో ఉన్న 39 వార్డుల సంఖ్యను పెంచకుండా విలీనం ప్రతిపాదిత గ్రామాలను ఆయా వార్డుల్లో చేర్చారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ బిసి మహిళకు రిజర్వ్ చేసినట్లు స్పష్టం కావడంతో తొలిగా జనసేన అభ్యర్థిని కూడా ప్రకటించారు. ఈ నేపథ్యంలో చినఅమిరం నుంచి కొందరు స్థానికులు విలీనానికి అభ్యంతరం వ్యక్తం చేస్తూ హైకోర్టును ఆశ్రయించారు. ఇదిలా ఉండగా గత కలెక్టర్ పి.ప్రశాంతి మిగిలిన మూడు పంచాయతీల రికార్డులను మున్సిపాలిటీకి అప్పగించాలని కార్యదర్శులను ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో కొవ్వాడ అన్నవరం, రాయలం గ్రామాల నుంచి కొందరు స్థానికులు హైకోర్టును ఆశ్రయించారు. తాడేరు గ్రామస్తులు మాత్రం మౌనం వహించారు. దీంతో గత ఐదేళ్లుగా భీమవరం మున్సిపాల్టీలో గ్రామాల విలీన ప్రతిపాదనకు బ్రేక్ పడింది. గత 17 ఏళ్లుగా మాస్టర్ ప్లాన్ లేని భీమవరం పట్టణానికి 2023లో ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ విలీన గ్రామాలతో కలిపి మాస్టర్ ప్లాన్ డ్రాఫ్ట్ కూడా విడుదల చేసింది. అయితే గ్రామాల విలీనం, ఎన్నికలు, మాస్టర్ ప్లాన్ ప్రశ్నార్థకంగా మిగిలిపోయాయి.

ఎన్నికలు ప్రశ్నార్థకమే

కార్పొరేషన్ లేదా మున్సిపాల్టీ స్థాయిలో ఎన్నికలు ఇప్పట్లో జరుగుతాయనేది ప్రశ్నార్థకంగా మారింది. గ్రామాల విలీనం సమస్య కోర్టులో ఉండటం ప్రధాన కారణంగా కన్పిస్తోంది. ఆ గ్రామాలు కలవకుండా జనాభా సంఖ్య, విస్తీర్ణం పెరగదు. కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ చేయాలంటే ఆ రెండు అంశాలు కీలకమే. ఇక కోర్టులో కేసులు ఉపసంహరించుకోవడం అంత సులభమైన విషయం. జిల్లాలో మరో మూడు మున్సిపాల్టీలు గ్రామాల విలీనం సమస్యను ఎదుర్కొంటున్నాయి. ఇక విలీన ప్రతిపాదిత గ్రామాల జనాభా ఆధారంగా రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి చేశారు. వీటితోపాటు ఎన్నో సాంకేతిక సమస్యలు ఉన్నాయి. ఈ అంశాలన్నింటినీ పరిశీలిస్తే భీమవరం మున్సిపల్ ఎన్నికలు ఇప్పట్లో జరిగే అవకాశం కన్పించడం లేదు. దీంతో పట్టణ ప్రజలు మున్సిపల్ ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయా.. కొత్త పాలకవర్గం ఎప్పుడు కొలువుదీరుతుందా.. తమ సమస్యలు పరిష్కారానికి ఎప్పటికి నోచుకుంటాయోనని ప్రశ్నార్థకంగా ఎదురుచూస్తున్నారు.

మున్సిపల్ మంత్రి వద్దకు భీమవరం మున్సిపాల్టీ సమస్య

ఇటీవల భీమవరం పర్యటనకు వచ్చిన మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ, భీమవరం ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) నివాసానికి విచ్చేశారు. ఈ నేపథ్యంలో టిడిపి కూటమి నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. దీంతో భీమవరం మున్సిపల్ ఎన్నికలకు సంబంధించిన అంశాన్ని నేతలు మంత్రి నారాయణ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మున్సిపల్ ఎన్నికల అంశం మరోసారి తెరపైకి వచ్చింది. భీమవరం మున్సిపాల్టీ ఇప్పటికిప్పుడు కార్పొరేషన్ కావడం కష్టమని, స్థానిక నాయకులు అంతా చర్చించుకుని ఓ నిర్ణయానికి వస్తే ఎప్పుడైనా ఎన్నికలు నిర్వహించుకోవచ్చని మంత్రి సంకేతాలు ఇచ్చినట్లు తెలిసింది. భీమవరం మున్సిపాల్టీని కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ చేస్తామంటే విలీనానికి అంగీకరిస్తామని, కేసుల ఉపసంహరణకు ముందుకొస్తామని కొంతమంది మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది.

సరుకులు అందిస్తున్న కలెక్టర్ నాగరాణి, ఎంఎల్‌ఎ అంజిబాబు

చౌక ధరలకు నూనె, ఉల్లి, టామాటా

కలెక్టర్ చదలవాడ నాగరాణి
కౌంటర్‌ను ప్రారంభించిన ఎంఎల్‌ఎ అంజిబాబు

ప్రజాశక్తి - భీమవరం

బహిరంగ మార్కెట్లో వంట నూనెలు, టమాటాలు, ఉల్లిపాయల ధరల నియంత్రణకు ప్రభుత్వం ద్వారా సరసమైన ధరలకు అందిస్తున్న సరుకులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. గురువారం స్థానిక ఫ్లైఓవర్ వద్ద మున్సిపల్ కాంప్లెక్స్‌లో చౌక ధరలకు టమాటా, వంట నూనెలు, ఉల్లిపాయల అమ్మకాలకు ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌ను ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ బహిరంగ మార్కెట్లో రోజురోజుకీ కూరగాయలు, వంటనూనెలు, ఉల్లిపాయల ధరలు పెరిగిపోవడం సామాన్య, మధ్యతరగతి ప్రజలకు భారంగా మారిందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం సబ్సిడీ ధరలకు జిల్లాలోని రైతు బజార్ల ద్వారా అమ్మకాలను ప్రారంభించినట్లు తెలిపారు. దీనిలో భాగంగా స్థానిక మున్సిపల్ కాంప్లెక్స్‌లో షాపును ప్రారంభించామన్నారు. జిల్లాలోని భీమవరం, పాలకొల్లు, నరసాపురం రైతు బజార్లలో, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ప్రధాన కేంద్రాల్లో ప్రత్యేక కౌంటర్ల ద్వారా అమ్మకాలను చేపట్టినట్లు తెలిపారు. కిలో టమాటా రూ.50, ఉల్లిపాయలు కర్నూల్ రకం కిలో రూ.32, మహారాష్ట్ర రకం కిలో రూ.47, పామాయిల్ 800 గ్రాములు ప్యాకెట్ రూ.119, సన్‌ఫ్లవర్ 910 గ్రాములు ప్యాకెట్ రూ.127 చొప్పున అమ్మకాలు చేస్తున్నట్లు వివరించారు. వినియోగదారులు ఆధార్ కార్డు లేదా రేషన్ కార్డు తీసుకొచ్చి ఒక్కో కిలో చొప్పున నిర్ణీత ధర చెల్లించి పొందవచ్చునని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని ప్రజలంతా వీటిని వినియోగించుకోవాలని కోరారు. భీమవరం ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు మాట్లాడుతూ బహిరంగ మార్కెట్లో టమాటా, ఉల్లిపాయలు, వంటనూనెల ధరలు విపరీతముగా పెరిగినందున రాష్ట్ర ప్రభుత్వం వినియోగదారులకు సరసమైన ధరలకు అందించేందుకు చర్యలు చేపట్టిందన్నారు. త్వరలో కందిపప్పు, మినపప్పు తదితర వస్తువులను ప్రత్యేక కౌంటర్లలో అమ్మకాలు చేపట్టినట్లు ఎంఎల్‌ఎ తెలిపారు. కలెక్టర్, ఎంఎల్‌ఎ చేతుల మీదగా వినియోగదారులకు టమాటాలు, ఆయిల్ ప్యాకెట్లు, ఉల్లిపాయలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ జిల్లా మేనేజర్ టి.శివరామప్రసాద్, డిఎస్‌ఒ ఎన్.సరోజ, జిల్లా మార్కెటింగ్ శాఖాధికారి సునీల్‌కుమార్, భీమవరం రైతుబజార్ ఎస్టేట్ అధికారి కళ్యాణ్, భీమవరం మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, తహశీల్దార్ ఆర్.రాంబాబు, వినియోగదారులు పాల్గొన్నారు.

ఆకివీడు: ప్రభుత్వం చౌకగా అందించే సరుకులను ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని ఉండి ఎంఎల్‌ఎ రఘురామకృష్ణంరాజు విజ్ఞప్తి చేశారు. బహిరంగ మార్కెట్లో నిత్యావసరాల ధరలు భారీగా పెరిగిన తరుణంలో గురువారం స్థానిక మెయిన్ బజార్ వద్ద ప్రభుత్వ విక్రయ కేంద్రాన్ని తెరిచారు. ఈ కేంద్రాన్ని ఎంఎల్‌ఎ రఘురామకృష్ణంరాజు ప్రారంభించి మాట్లాడారు. అనంతరం జిల్లా అధికారులు సరోజనమ్మ, శివరాంప్రసాద్ మాట్లాడగా కార్యక్రమంలో తహశీల్దార్ నందూరి వెంకటేశ్వరరావు, సిఎస్ డిటి ఎం.మహేశ్వరరావు, పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. ఈ విక్రయ కేంద్రానికి ఉచితంగా భవనాన్ని సమకూర్చిన కూనపురాజు వెంకట శివరామరాజును పలువురు అభినందించారు.

సరుకులు అందిస్తున్న ఎంఎల్‌ఎ రఘురామకృష్ణంరాజు

తారాస్థాయికి గరగపర్రు శ్మశాన వాటిక సమస్య

ఇరుపక్షాలు పరస్పర విమర్శలు
అధికారుల నాన్చుడు ధోరణితో సమస్య జఠిలం

ప్రజాశక్తి - భీమవరం

గరగపర్రు శ్మశాన వాటిక సమస్య తారాస్థాయికి చేరింది. ముస్లింలు, ఎస్‌సిలు పరస్పర ఆరోపణలకు దిగారు. స్థానిక మసీదులో ముస్లింలు, స్థానిక చర్చిలో ఎస్‌సిలు గురువారం వేర్వేరుగా విలేకరుల సమావేశాలను ఏర్పాటు చేశారు. సర్వే నెంబరు 384/2లో సుమారు నాలుగెకరాల 58 సెంట్లు శ్మశాన భూమి ఉంది. అయితే ఈ శ్మశాన వాటిక ఏఒక్క కులానిది కాదని, గ్రామం అంతటికీ చెందినదని ముస్లింలు, కాదు ఎస్‌సిల శ్మశాన వాటిక భూమి అని మద్రాస్ హైకోర్టు ఉత్తర్వులు కూడా ఇచ్చిందని ఎస్‌సిలు చెబుతున్నారు. అయితే రెవెన్యూ అధికారులు బుధవారం శ్మశాన వాటిక స్థలాన్ని సర్వే చేశారు. శ్మశాన వాటిక భూమి ఎంత ఉంది, ఎంత ఆక్రమణకు గురైంది, ఎంత మేర నిర్మాణాలు జరిగాయి, మిగిలిన భూమి ఎంత ఉందనేది తేల్చారు. అయితే కేటాయింపులు మాత్రం ఇంకా చేయలేదు. అయితే శ్మశాన వాటిక సమస్య ఏర్పడి రోజులు గడుస్తున్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇరుపక్షాలు పరస్పర ఆరోపణలకు దిగడం గ్రామంలో చర్చనీయాంశమైంది.

ఎవరి భూమీ ఆక్రమించలేదు

ఎంపిటిసి శంకరం

కొన్ని రోజుల నుంచి తనపై అసత్య ప్రచారాలు జరుగుతున్నాయని, తాను ఎవరి భూమీ ఆక్రమించలేదని గరగపర్రు ఎంపిటిసి సభ్యులు షేక్ పాపాసాహెబ్ (శంకరం) అన్నారు. మసీదులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామంలో కొంత శ్మశాన వాటిక భూమి ఉందని, ఇది అందరికీ చెందిన భూమి అని చెప్పారు. గతంలో కొంత భూమిని పంచాయతీ మసీదు నిర్మాణానికి కేటాయించిందన్నారు. దీన్ని ఆనుకుని కొంతస్థలాన్ని కొనుగోలు చేసినట్లు చెప్పారు. అయితే ఆ భూమిని తాను ఆక్రమించుకుని కొనుగోలు చేశానని ప్రచారం చేస్తున్నారని, తనకూ ఈ స్థలానికి ఎటువంటి సంబంధమూ లేదని, ముస్లిం సంఘానికి కొనుగోలు చేశానని స్పష్టం చేశారు. కొంతమంది కావాలనే తనపై బురద చల్లే విధంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. ఎస్‌సిలతో తామంతా అన్నదమ్ముల భావనతోనే ఉన్నామని, కావాలనే కొంతమంది తమ మధ్య తగాదాలు సృష్టిస్తున్నారన్నారు. ఇటీవల బుల్డోజర్‌తో దౌర్జన్యంగా తమపైకి రావడంతో అడ్డుకున్నామని చెప్పారు. ఇప్పటికీ సోదర భావంతో కలిసిమెలిసి వెళ్లాలనేది తమ ఆకాంక్షని, సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవడానికి అంతా సిద్ధంగా ఉన్నామని తెలిపారు. సమావేశంలో షేక్ అబ్దుల్లా, షేక్ హుస్సేన్, షేక్ మొల హుస్సేన్, షేక్ సిద్దా సాహెబ్, షేక్ మస్తాన్ వలీ, షేక్ సాహెబ్, లాలా సాహెబ్ పాల్గొన్నారు.

అన్నదమ్ములంటూనే.. అవాస్తవాలు సరికాదు

ఎస్‌సిలు

ఎంపిటిసి శంకరం బాధ్యతాయుతమైన పదవిలో ఉండి స్థలాలను రక్షించాల్సిందిపోయి ఆక్రమించుకోవడం అన్యాయమని, ఇదేమిటని ప్రశ్నించినందుకు అన్నదమ్ములంటూనే స్థలాన్ని ఆక్రమించలేదని అడ్డంగా బొంకడం సరైంది కాదని ఎస్‌సిలు విమర్శించారు. ఎస్‌సిల శ్మశాన వాటిక భూమి అందరికీ చెందినదని చెప్పడం దుర్మార్గమన్నారు. శ్మశాన స్థలాన్ని తమ సంఘానికి కొనుగోలు చేశామని చెబుతున్న శంకరం, అసలు శ్మశాన స్థలాన్ని అమ్మేందుకు వారెవ్వరూ, కొనేందుకు మీరెవ్వరని ప్రశ్నించారు. ప్రభుత్వ భూమి అని ఫ్లెక్సీ పెట్టించి, మళ్లీ ఆ భూమిని మేమే కొన్నామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. నాలుగేళ్ల నుంచి శ్మశానవాటిక భూమి రక్షణ కోసం ఎంతోమంది అధికారులకు విన్నవించినా కనీసం పట్టించుకోలేదని గుర్తు చేశారు. గ్రామంలో ఎవరైనా చనిపోతే శ్మశానానికి తీసుకెళ్లేందుకు దారి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. శ్మశాన భూమి ఆక్రమణకు గురి కావడమే ఈ పరిస్థితికి మూలమన్నారు. మసీదు, నిర్మించుకున్న ఇళ్లు మినహాయించి, ఆక్రమణలు తొలగించి మిగిలిన భూమిని తమకు అప్పగించాలని డిమాండ్ చేశారు. రెచ్చగొట్టే విధంగా ప్రవర్తిస్తున్న ఎంపిటిసి శంకరంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో జి.చిన్న, ఏసేబు, కె.ఏసు, డోలా యోనా, సిహెచ్.చిట్టిబాబు, జీవరత్నం, విజయరావు పాల్గొన్నారు

రెండేళ్ల వరకు పంట రుణాల రీషెడ్యూల్

కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, సంభవించిన వరదలకు పంటలు దెబ్బతిన్న రైతులు వారు తీసుకున్న పంట రుణాలు రెండేళ్ల వరకు రీషెడ్యూల్ చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. రైతులు తీసుకున్న పంట రుణాలు తిరిగి చెల్లింపు మారిటోరియం (తాత్కాలిక నిషేధం)తో కలిపి రెండేళ్ల వరకు పొడిగించుకునే అవకాశం ఉందని వివరించారు. ఈ విధంగా చేసుకుంటే రైతుల నుండి అదనంగా ఎలాంటి జరిమానా, వడ్డీ వసూలు చేయబోరని స్పష్టం చేశారు. ఈ సౌకర్యం వర్తించాలంటే సంబంధిత పంట రుణం చెల్లించే గడువు దాటిపోయి ఉండకూడదని తెలిపారు. జిల్లాలో పంట రుణాలు తీసుకున్న రైతులు వారికి సంబంధించిన బ్యాంకులను సంప్రదించి వారి పంట రుణాలను రీషెడ్యూల్ చేసుకోవచ్చుని తెలిపారు. అలాగే బ్యాంకర్లు కూడా వారిని సంప్రదించిన రైతులకు ఎలాంటి ఇబ్బందులూ కలిగించకుండా అన్ని విధాలా సహకరించి వారి పంట రుణాలు రీషెడ్యూల్ అయ్యేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

'తేమ' దోపిడీకి అడ్డుకట్ట పడేనా..!

గత ప్రభుత్వ హయాంలో మిల్లర్ల దోపిడీకి ధాన్యం రైతులు విలవిల
తేమశాతం పేరుతో రైతుల నుంచి సొమ్ము వసూలు
ధాన్యం కొనుగోలులో రైతుల ప్రధాన సమస్య తేమ నిర్ధారణే
ఆర్‌బికె అధికారులు నిర్ధారించిన తేమశాతాన్ని పట్టించుకోని మిల్లర్లు
కూటమి ప్రభుత్వంలోనైనా పరిస్థితి మారేనా అంటూ రైతుల్లో చర్చ
రెండు జిల్లాల్లో ఖరీఫ్‌లో 10.90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు ప్రణాళికలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఖరీఫ్ మాసూళ్లు ప్రారంభమయ్యాయి. మెట్టప్రాంతంలో ధాన్యం మాసూళ్లు జరుగుతున్నాయి. ఈ నెల 15వ తేదీ నుంచి ధాన్యం కొనుగోలుకు అధికారులు సిద్ధమవుతున్నారు. రైతుల్లో నెలకొన్న అనుమానాలకు మాత్రం అధికారుల నుంచి ఇప్పటి వరకూ స్పష్టమైన సమాధానం దక్కని పరిస్థితి నెలకొంది. గత ప్రభుత్వ హయాంలో తేమశాతం పేరుతో మిల్లర్లు సాగించిన దోపిడీని ఏవిధంగా అరికడతారో స్పష్టత ఇవ్వడం లేదు. ఆర్‌బికె అధికారులు నిర్ధారించిన తేమశాతాన్ని పట్టించుకోకుండా మిల్లర్లు ఇష్టానుసారంగా తేమశాతం నిర్ధారించి డబ్బు వసూలు చేసిన ఘటనలను రైతులు మరిచిపోలేక పోతున్నారు. టిడిపి కూటమి ప్రభుత్వంలోనైనా ధాన్యం తేమశాతం నిర్ధారణపై ఏవిధంగా ముందుకు సాగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. రైతుసేవా కేంద్రాల అధికారులు నిర్ధారించిన తేమశాతం అంతిమమా.. లేక మిల్లర్లు నిర్ధారించిన తేమశాతాన్ని పరిగణనలోకి తీసుకుంటారా అనేది అధికారులు స్పష్టత ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. ప్రస్తుత ఖరీఫ్‌లో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో దాదాపు నాలుగున్నర లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేశారు. ఏలూరు జిల్లాలో 5.60 లక్షల మెట్రిక్ టన్నులు, పశ్చిమగోదావరి జిల్లాలో 5.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఏలూరు జిల్లాలో 247, పశ్చిమలో 264 రైతుసేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రెండు జిల్లాలవ్యాప్తంగా 10.90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి రానుందని అంచనా. ప్రస్తుత ఖరీఫ్‌లో రైతులు ఎన్నో ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొని పంట సాగు చేశారు. భారీ వర్షాలకు నాట్లు, నారుమడులు దెబ్బతినడంతో అదనపు పెట్టుబడులు పెట్టాల్సి వచ్చింది. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రైతులకు దక్కితేనే కొంతలోకొంత ఊరట కలుగుతుంది. అన్నదాతకు మద్దతు ధర దక్కాలంటే మిల్లర్ల దోపిడీని అరికడితేనే సాధ్యం.

రైతుసేవా కేంద్రాల సిబ్బంది నిర్ధారించిన తేమశాతం ప్రకారమే ధాన్యం తీసుకోవాలి

కె.శ్రీనివాస్, రైతుసంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి

ధాన్యం కొనుగోలులో తేమశాతం పేరుతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఆర్‌బికె సిబ్బంది నిర్ధారించిన తేమశాతాన్ని మిల్లర్లు పరిగణనలోకి తీసుకోకుండా రైతుల నుంచి సొమ్ము వసూలు చేసేవారు. ధాన్యం కొనుగోలు చేస్తున్న రైతుసేవా కేంద్రాల సిబ్బంది నిర్ణయించిన తేమశాతం ప్రకారమే మిల్లర్లు ధాన్యం తీసుకోవాలి. మిల్లర్లు డబ్బు వసూలు చేసే విధానాన్ని రద్దు చేయాలి. రైతులకు మద్దతు ధర అందేవిధంగా చర్యలు తీసుకోవాలి.

తేమశాతం నిర్ధారణపై స్పష్టమైన ఆదేశాలిస్తారా..?

గత ప్రభుత్వ హయాంలో ఆర్‌బికెల ద్వారా ధాన్యం కొనుగోలు సాగింది. ఆర్‌బికె అధికారులు నిబంధనలకు అనుగుణంగా ధాన్యంలో 17 శాతంలోపు తేమ ఉందని నిర్ధారించి ధాన్యాన్ని మిల్లులకు తరలించేవారు. మిల్లర్లు మాత్రం తేమ 19, 20 శాతం ఉందంటూ ధాన్యాన్ని దిగుమతి చేసుకోకుండా నిలిపేసేవారు. ధాన్యానికి అందించే మద్దతు ధర ప్రాతిపదికన అదనంగా చెప్పిన తేమ పాయింట్లకు డబ్బు వసూలు చేసేశారు. ఫోన్‌పే ద్వారా డబ్బు చెల్లించిన తర్వాతే ధాన్యం దిగుమతి చేసుకునేవారు. దీంతో మిల్లుల వద్ద ధాన్యం రెండు, మూడు రోజులు ఉండిపోయేవి. దీంతో వాహన యజమానులు అదనంగా కిరాయి వసూలు చేసేవారు. అటు తేమపేరుతో, ఇటు రవాణా ఛార్జీల పేరుతో రైతులు తీవ్రంగా నష్టపోయేవారు. ఆర్‌బికె అధికారులు నిర్ధారించిన తర్వాత తేమశాతంలో తేడా ఉందంటూ మిల్లర్లు డబ్బు వసూలు చేయడంపై అప్పట్లో పెద్దఎత్తున రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. అయినా ప్రభుత్వం సమస్యను పరిష్కరించలేదు. ప్రభుత్వం మారింది. ఇప్పుడు రైతుసేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రైతుసేవా కేంద్రాల్లోని సిబ్బంది తేమశాతం నిర్ధారించిన తర్వాత, మిల్లర్లు గతంలో మాదిరిగా తేమశాతం ఎక్కువగా ఉందని చెబితే రైతులు ఏం చేయాలో అధికారులు చెప్పాల్సి ఉంది. మిల్లర్లు డబ్బు చెల్లించాలని అడిగితే ఎవరిని సంప్రదించాలో స్పష్టత ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రకారం 75 కిలోల బస్తాకు రూ.1740 వరకూ అందాలి. మద్దతు ధర అందేవిధంగా అధికారులు చర్యలు తీసుకుంటేనే రైతులకు మేలు జరుగుతుంది. గత ప్రభుత్వ హయాంలో తేమశాతం, తూకంలోనూ తేడా పేరుతో మిల్లర్లు రైతుల నుంచి భారీగా డబ్బు వసూలు చేసేవారు. అధికారులు ఈ సమస్యలపై దృష్టి సారిస్తే చాలని అన్నదాత కోరుతున్నాడు.

శశికళను సత్కరిస్తున్న యాజమాన్యం, ప్రొఫెసర్లు

డాక్టర్ శశికళకు ఎయు డాక్టరేట్

ప్రజాశక్తి - భీమవరం టౌన్

స్థానిక ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో సివిల్ ఇంజినీరింగ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జి.శశికళకు సివిల్ ఇంజినీరింగ్‌లో ఆంధ్రా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసిందని ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మురళీకృష్ణంరాజు చెప్పారు. ఈ సందర్భంగా యాజమాన్యం తరపున కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిషాంత్ వర్మ డాక్టర్ శశికళను ఘనంగా సత్కరించారు. డాక్టర్ శశికళ మాట్లాడుతూ 'ఇన్విస్టిగేషన్ ఆఫ్ స్ట్రుత్ అండ్ ఎలాస్టిక్ ప్రాపర్టీస్ ఆఫ్ హైపో స్లడ్జ్ అండ్ కాపర్ కోటెడ్ మైక్రో స్టీల్ ఫైబర్ రేయిన్ ఫోర్స్‌డ్ సెల్ కాంపాక్టింగ్ కాంక్రీట్ విత్ డిఫరెంట్ సిమెంట్స్' అనే అంశంపై ఆంధ్రా యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్.ఆదిశేషు పర్యవేక్షణలో తాను చేసిన పరిశోధనకుగాను ఎయు తనకు డాక్టరేట్ ప్రదానం చేసిందన్నారు. కళాశాల డైరెక్టర్, సివిల్ ఇంజినీరింగ్ నిపుణులు డాక్టర్ ఎం.జగపతిరాజు మాట్లాడుతూ ప్రస్తుతం నిర్మాణరంగం ఎంతో వేగంగా అభివృద్ధి చెందుతున్న దశలో ఇటువంటి పరిశోధనలు కాంక్రీట్ పటిష్టతకు దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో సివిల్ ఇంజినీరింగ్ హెడ్స్ డాక్టర్ జి.శ్రీబాల, డాక్టర్ ఎసిఎస్‌వి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రతన్ టాటా మృతి తీరని లోటు

ప్రజాశక్తి - మొగల్తూరు

రతన్ టాటా మృతి దేశానికి తీరని లోటని మొగల్తూరులోని ఆర్యవైశ్య సంఘ సభ్యులు అన్నారు. గురువారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కారుమూరి దత్తుడు, సీమకుర్తి బాలాజీ, కారుమూరి రవి, అనంతపల్లి అనిల్, మానేపల్లి రంగా పాల్గొన్నారు.

విద్యుత్ ఎడిఇగా రామకృష్ణ

ప్రజాశక్తి - పాలకొల్లు

ఎడిఎ రామకృష్ణను అభినందిస్తున్న సిబ్బంది

పాలకొల్లు పట్టణ విద్యుత్ ఎడిఇగా సిహెచ్.రామకృష్ణ గురువారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన కె.వెంకట్రావు రూరల్ సబ్ డివిజన్‌కు బదిలీ అయ్యారు. రూరల్ ఎడిఇగా పనిచేస్తున్న ఆర్.నాగేశ్వరరావు ఏలూరుకు బదిలీ అయ్యారు. గతంలో పట్టణ ఎఇగా పనిచేసిన రామకృష్ణ జిల్లా స్థాయిలో ఉత్తమ ఎఇగా పలు అవార్డులు తీసుకున్నారు. రామకృష్ణను పట్టణ ఎఇ బాబ్జి పోడూరు, వీరవాసరం ఎఇలు అభినందించారు. గతంలో ఇక్కడ పట్టణ ఎఇగా పనిచేసిన రామకృష్ణ తణుకు ఎడిఇగా ప్రమోషన్‌పై వెళ్లి తిరిగి పాలకొల్లు విచ్చేశారు.

వీరరాఘవరెడ్డి సేవలు విలువైనవి

ప్రజాశక్తి - పెనుమంట్ర

మార్టేరు గ్రామ పంచాయతీ సర్పంచిగా కోనాల వీర రాఘవరెడ్డి సేవలు విలువైనివని మాజీ మంత్రి, ఆచంట ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ అన్నారు. మార్టేరులో కోనాల వీరరాఘవరెడ్డి చిత్ర పటానికి పూల మాలవేసి నివాళు లుర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయనతో పాటు టిడిపి మార్టేరు గ్రామ కార్యవర్గం, మండలంలోని పలు ప్రాంతాల నాయకులు, కార్యకర్తలు కోనాల కుటుంబాన్ని పరామర్శించారు.

ఇవ్వడంలోనే నిజమైన ఆనందం

ప్రజాశక్తి - పాలకొల్లు

ఎదుటివారికి ఓదార్పు, ఆనందం కలిగించే సాయం చేయడం ద్వారా మనకు ఎంతో మానసిక ఆనందం కలుగుతుందని వాకర్స్ క్లబ్, పాలకొల్లు అధ్యక్షుడు తటవర్తి సుధాకరరావు అన్నారు. గురువారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా గుండె, మెదడుకు సంబంధించిన వ్యాధులతో బాధపడుతున్న పాలకొల్లు పట్టణానికి చెందిన ఇద్దరు పేద రోగులు కుంపట్ల శ్రీనివాస్, వై.కరుణలకు రూ.12 వేల విలువైన మందులను పాలకొల్లు ప్రియాంక టవర్స్ వద్ద క్లబ్ తరపున అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి షేక్ పీర్ సాహెబ్, కోశాధికారి పోతుల ఉమాశంకరరావు, ఉపాధ్యక్షుడు మానెం బసవరాజు, జవ్వాజి కళ్యాణ్, ఆనందకృష్ణ పాల్గొన్నారు.

పారిశుధ్య పనులపై నిర్లక్ష్యం వద్దు

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం మున్సిపాలిటీ 14 వార్డులో పారిశుధ్య పనులను మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య పనులపై ఎటువంటి నిర్లక్ష్యం వహించొద్దని, డోర్ టు డోర్ తడిచెత్త పొడి పొడిచెత్త వేర్వేరుగా సేకరణకు సంబంధించి పురోగతిని ప్రతి పనివారిని ఆయన అడిగి తెలుసుకున్నారు. దోమల నివారణ మందును పిచికారీ చేయాలని సూచించారు. హాజరు శాతాన్ని మరింత పెంచేందుకు కృషి చేయాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్లను ఆదేశించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకూడదన్నారు. ఈ కార్యక్రమంలో కొప్పాడ కృష్ణవేణి కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, కిషోర్, శానిటరీ సిబ్బంది శాలిని పాల్గొన్నారు.

'రోజురోజుకు పుంజుకుంటున్న కాంగ్రెస్'

ప్రజాశక్తి - పాలకొల్లు

దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ రోజురోజుకు పుంజుకుంటోందని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పాతపాటి హరి కుమార్‌రాజు చెప్పారు. పాలకొల్లు కాంగ్రెస్ కార్యాలయంలో పట్టణ కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యకర్తలందరూ చిత్తశుద్ధితో పార్టీ పురోభివృద్ధికి పనిచేయాలన్నారు. పనిచేసిన కార్యకర్తలందరికీ పార్టీ తగిన గుర్తింపు ఇస్తుందని చెప్పారు. ఇటీవల జరిగిన హర్యానా ఎన్నికల్లో కాంగ్రెస్ స్వల్ప మెజారిటీతో అధికారం కోల్పోయిందని చెప్పారు. రానున్న ఎన్నికల్లో రాహుల్ గాంధీ ప్రధాని కావడం ఖాయమని చెప్పారు. సమావేశానికి కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు యడ్ల శివాజీ అధ్యక్షత వహించారు. పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి నాగేశ్వరరావు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి కొలుకులూరి అర్జున్‌రావు, వర్ధనపు కాసు, యలమర్తి మోహన్‌రావు, మడకల గోపాల్‌రావు, డాక్టర్ వై.నామగిరి, షేక్ మదీనా బాషా, కొరగింజల హరికిరణ్, గోడి మోహన్‌రావు, బొలిశెట్టి భానుప్రకాష్, రుంకానీ శ్రీనివాసరావు, కట్టా గోపాలకృష్ణ, కె.ప్రభుదాస్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - ఆచంట

పరిపాలనాపరమైన అంశాలను పంచాయతీ పాలకవర్గ సభ్యులు తెలుసుకోవడం ద్వారా గ్రామ పరిపాలన మరింత బలోపేతం అవుతుందని ఎంపిడిఒ స్వరాజ్ శ్రీకర్ అన్నారు. ఆచంట మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ పాలకవర్గ సభ్యులకు జరుగుతున్న శిక్షణ కార్యక్రమాలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఎంపిడిఒ స్వరాజ్ శ్రీకర్ మాట్లాడుతూ పంచాయతీ కార్యాలయంలో జరిగే ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి వాటిపై అవగాహన తెచ్చుకోవాలన్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు కృషి చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఈ శిక్షణా తరగతులకు మాస్టర్ ట్రైనీలుగా పాలకొల్లు ఇఒపిఆర్‌డి టి.మూర్తిబాబు, కొడమంచిలి పంచాయతీ కార్యదర్శి ఎం.హనుమంతరావు వివిధ అంశాలపై పాలకవర్గ సభ్యులకు అవగాహన కల్పించారు.

అగ్నిప్రమాద బాధితులకు సాయం

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలోని పెదమామిడిపల్లి, కాపవరం గ్రామాల్లో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో నిరాశ్రయులైన రెండు కుటుంబాలకు ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో సహాయం అందించారు. బాధిత కుటుంబ సభ్యులకు బియ్యం, నిత్యావసర సరుకులు, వంట సామగ్రిని అందించారు. ధర్మారావు ఫౌండేషన్ ఛైర్మన్, రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు సాయం అందించారు.

రామరాజును కలిసిన రవీంద్రరాజు

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఎపి పారిశ్రామిక మౌలిక కార్పొరేషన్ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన ఉండి మాజీ ఎంఎల్‌ఎ మంతెన రామరాజును రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘ రాష్ట్ర అధ్యక్షులు భూపతిరాజు రవీంద్రరాజు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనతో పాటు నరసాపురం డివిజన్ అధ్యక్షులు కె.సత్తిబాబు, కొవ్వూరు డివిజన్ అధ్యక్షులు ఏజర్ల ప్రభాకర్ ఉన్నారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి

ప్రజాశక్తి - గణపవరం

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలని గణపవరం పిహెచ్‌సి డాక్టర్ పి.సంతోష్ అన్నారు. ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. 76 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. గర్భిణులు నాలుగు సార్లు పరీక్షలు చేయుంచుకోవాలని చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - ఉండి

ఉండి 220 కెవి నుంచి యండగండి 33 కెవి విద్యుత్ ఉపకేంద్రానికి వెళ్లే 33 కెవి లైన్లపై చెట్లు, కొమ్మలు తొలగించేందుకు శుక్రవారం ఉదయం ఎనిమిది గంటల నుండి పది గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎగిక్యూటివ్ ఇంజినీర్ (ఇఇ) ఎన్.వెంకటేశ్వరరావు తెలిపారు. ఆ సమయంలో మండలంలోని యండగండి, ఉనుదుర్రు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ సరఫరాలో జరిగే ఈ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

వరదొస్తే లంక గ్రామాల్లో కష్టాలే

ప్రవాహం ఎక్కువైతే ప్రమాదమే..

విలువైన పంటలకు నష్టమే..

పడవ ప్రయాణంతో ఇబ్బంది పడుతున్న ప్రజలు

వంతెన నిర్మించాలని వేడుకోలు

ప్రయాణికుల కోసం సిద్ధంగా ఉన్న పడవ

ప్రజాశక్తి - ఆచంట

అన్నదాతలకు సిరుల పంటలు పండిస్తున్న గోదావరి వర్షాకాలంలో మాత్రం ఉగ్రరూపంతో వణికిస్తోంది. ఈ కాలంలో ఎప్పుడు ఏ ఉపద్రవం ముంచేత్తుతుందోనని లంకగ్రామాల ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని కాలం వెల్లదీస్తారు. ప్రస్తుతం ఇదే పరిస్థితిలో లంక గ్రామాల ప్రజలు కొట్టుమిట్లాడుతున్నారు. లంక గ్రామాల్లో సుమారు 7 వేల మంది వరకూ నివసిస్తున్నారు. గోదావరి వరదొస్తే వీరి కష్టాలు వర్ణనాతీతం. బాహ్య ప్రపంచానికి దూరంగా గోదావరి మధ్యలో జీవించే లంక గ్రామాల ప్రజలకు అన్నీ సమస్యలే. అక్కడ రోడ్లు ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. వరదలు, భారీ వర్షాలకు అధ్వానంగా మారిన రోడ్లపై ప్రయాణానికి ప్రజల పాట్లు వర్ణనాతీతం. ఆచంట మండలంలోని లంక గ్రామాల్లో సుమారు 20 కిలోమీటర్ల మేర రహదారులు విస్తరించి ఉన్నాయి. పెదమల్లం పంచాయతీ పరిధిలో పెదమల్లం లంక, ఆనగారలంక, అయోధ్య లంక పంచాయతీ పరిధిలో పుచ్చలంక, మర్రిమూల, నక్కిడిలంక, రాయిలంక, పెద్దపేటలలో సుమారు 7 వేల మంది ప్రజలు జీవిస్తున్నారు. ఎన్నికలు, వరదల సమయంలో తప్ప అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు లంక గ్రామాల వైపు కన్నెత్తి చూడరని స్థానికులు బహిరంగనే విమర్శిస్తున్నారు. అసలే అంతంత మాత్రంగా ఉండే లంక రహదారులు ఎడతెరిపిలేని భారీ వర్షాలు, వరదలతో మరింత అధ్వానంగా మారాయి.

నిండా మునిగిన లంక రైతులు

గోదావరి ఉగ్రరూపంతో లంక రైతులు నిండా మునిగారు. ఆచంట మండలంలోని అయోధ్య లంక, పుచ్చలంక, మర్రిమూల, ఆనగార్లంక గ్రామాల్లో సుమారు 1000 ఎకరాల్లో కూరగాయ పంటలు పండిస్తున్నారు. మొన్నటి వరకూ గోదావరి వరద ఉధృతికి లంక గ్రామాల్లోని కూరగాయల తోటలు కొట్టుకుపోయాయి. లక్షలాది రూపాయల పెట్టుబడి పెట్టి తీవ్రంగా నష్టపోయామని, దిక్కుతోచడం లేదని రైతులు లబోదిబోమంటున్నారు. గోదావరికి ఆగస్టు, సెప్టెంబర్ మాసాలలో వరదలు సంభవిస్తాయని భావిస్తారు. ఆ లోపు ఆయా పంటలను పండించి సొమ్ములు చేసుకోవడం ఇక్కడ రైతుల ఆనవాయి. ఊహించని విధంగా వరదలు సంభవించడంతో పంటలు కొట్టుకపోవడం రైతులను కలిచి వేస్తుంది. అయోధ్య లంక, పుచ్చలంక గ్రామాల్లోని తమలపాకు, అరటి, మునగ, కొబ్బరి మొక్క తోటలకు కూడా తీవ్ర నష్టం వాటిల్లిందని వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

ప్రవాహం ఎక్కువైతే ప్రమాదమే...

గోదావరి నది పాయల నడుమ ఉన్న అయోధ్య లంక, పుచ్చలంక, మర్రి మూల, పల్లిపాలెం, పెదమల్లం లంక, ఆనగార్లంక, వాసులు గ్రామం నుంచి బయట ప్రాంతానికి అడుగు పెట్టాలంటే పడవ ప్రయాణం చేయవలసింది. అటు తూర్పునకు, ఇటు పశ్చిమకు వెళ్లాలన్నా ఇదే పరిస్థితి. దీంతో వీరికి పడవ ప్రయాణం నిత్యకృత్యంగా మారింది. పండించిన పంటలు మొదలు అవసరమైన చిన్నపాటి వస్తువులను సైతం పడవలపైనే చేర వేసుకోవాలి. ఈ నేపథ్యంలో గోదావరి వరద తాకిడి

అయోధ్య లంకలో నీట మునిగిన తమలపాకు తోటలు(ఫైల్ ఫొటో)

తగిలి నీటి ప్రవాహం పెరిగితే మాత్రం పడవ ప్రయాణం ప్రమాదంతో కూడుకున్నదే. దీంతో గ్రామంలో నిత్యవసర సరుకుల నుంచి అవసరమైన ప్రతి వస్తువు ధరలు కూడా భారీగా పెరిగిపోవడం పరిపాటిగా మారుతుంది.

విలువైన పంటలకు నష్టమే..

ప్రస్తుతం లంక భూముల్లో విలువైన పంటలు సాగవుతున్నాయి. వంగ, బెండ, పచ్చిమిర్చి, బీర, తోటకూర, మునగ, తమలపాకు, అరటి, తదితర పంటలు సైతం సాగు చేస్తున్నారు. వీటిల్లో ప్రస్తుతం పలు పంటలు చేతికి అంది వచ్చి ఆదాయాన్ని తెచ్చిపెడుతున్న నేపథ్యంలో ఇటీవల వరదలకు ఆ పంటలన్నీ వరద నీటిలో నానుతున్నాయి. ఇప్పటికే భారీగా పెట్టుబడులు పెట్టి తీవ్రంగా నష్టపోయామని, ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం ఇప్పించాలని లంక గ్రామాల రైతులు కోరుతున్నారు.

వారధి అందుబాటులోకి వస్తే..

గోదావరి నది పాయల నడుమ విస్తరించిన అయోధ్య లంక పంచాయతీ పరిధిలోని లంక గ్రామాలను అనుసంధానం చేస్తూ నిర్మించ తలపెట్టిన గోదావరి వరదకి భూమి పూజ జరిగి 10 సంవత్సరాలు పూర్తికావచ్చింది. అయోధ్య లంక అభివృద్ధికి నాంది పలికే ఈ వారధి నిర్మాణంపై లంక వాసులు భారీగా ఆశలు పెట్టుకున్నారు. వంతెన నిర్మాణం సహకారం అయితే రవాణా మార్గం ఏర్పడడంతో పాటు లంక గ్రామాలకు మహర్దశ చేకూరుతుంది. ఈ నేపథ్యంలో 2014 ఫిబ్రవరిలో రూ.50 కోట్ల వ్యయంతో వారధి నిర్మాణానికి భూమిపూజ జరిగినా నేటికీ పునాదిరాయి పడకపోవడంతో లంక వాసులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ఈ వారధి నిర్మాణం పూర్తయి అందుబాటులోకి వస్తే పడవ ప్రయాణ బాధలు పూర్తిగా తొలగిపోతాయి.

రేవు సౌకర్యం లేక ఇబ్బందులు..

దినదిన గండంగా పడవ ప్రయాణం చేస్తున్న వీరికి రేవు సౌకర్యం కూడా లేదు. దీంతో పడవ ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు తరచూ ప్రమాదాలకు గురవుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చుట్టూ గోదావరి ఉన్న రక్షిత మంచినీరు లంక వాసులకు చేరడం లేదు. ఆచంటలో నిర్మించిన భారీ మంచినీటి పథకం ద్వారా శుద్ధి చేసిన నీటిని అందించాలని అయోధ్యలంక గ్రామస్తులు కోరుతున్నారు.

వంతెన నిర్మించాలి

యడ్ల సరోజిని, అయోధ్య లంక

మా గ్రామానికి వంతెన నిర్మిస్తే పడవ ప్రయాణ బాధలు పూర్తిగా తొలగిపోతాయి. వరదల సమయంలో కూడా రవాణాకు ఎటువంటి ఆటంకాలు ఉండవు. వరదలు వస్తే ఎప్పుడు ఏ ఉపద్రవం ముంచుకొస్తుందోనని ప్రాణాలు అరిచేతిలో పెట్టుకుని కాలం వెల్లదీస్తున్నాం. పనులు లేక అర్థాకలితో అలమటిస్తున్నాం. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి

లంక గ్రామాలాభివృద్ధి వంతెనతోనే సాధ్యం

గుదాల వరలక్ష్మి, అయోధ్య లంక

బయట ప్రాంతాలకు అడుగు పెట్టాలంటే పడవ ప్రయాణం చేయవలసిందే. ఎన్నికల సమయంలో ప్రజా ప్రతినిధులు వంతెన నిర్మిస్తామని హామీ ఇస్తున్నారు తప్ప ఆ హామీని నెరవేర్చడం లేదు. లంక గ్రామాల అభివృద్ధి వంతెనతోనే ముడిపడి ఉంది. వరదల సమయంలో విద్యార్థులు పాఠశాలలకు వెళ్లలేకపోతున్నారు. దీంతో చదువు మానిపించవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. ప్రజాప్రతినిధులు స్పందించి వంతెన నిర్మించాలి.

అన్ని రంగాల్లో రాణిస్తున్న బాలికలు

అంతర్జాతీయ బాలిక దినోత్సవంలో వక్తలు

ప్రజాశక్తి - మొగల్తూరు

బాలికలు అన్ని రంగాల్లో ముందంజలో ఉంటున్నారని, భవిష్యత్తు బాలికలదేనని సిడిపిఒ బి.ఊర్మిళ అన్నారు. మొగల్తూరులోని ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో అంతర్జాతీయ బాలిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించి సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. బాలికలందరికీ చదువే మార్గం, చదువే గమ్యంగా ఉండాలన్నారు. అనేక రంగాల్లో రాణించిన మహిళలను ఆదర్శంగా తీసుకుని మంచి భవిష్యత్తు కోసం ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. చదువే వారి భవిష్యత్తుకు మంచి పునాది అవుతుందన్నారు. దాంతో పాటుగా ప్రతి ఆడపిల్ల వ్యక్తిగత పరిశుభ్రతను, రుతుక్రమ పరిశుభ్రత పాటించాలని, పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని చెప్పారు. ఉన్నత విద్యనభ్యసించి దేశ అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. ప్రతి బాలిక మంచి విద్య అభ్యశించి వివాహ వయస్సు వచ్చిన తరువాత వివాహం చేసుకుంటే వారి భవిష్యత్ బంగారు బాట అవుతుందన్నారు. అనంతరం కిశోర బాలికలు, అంగన్వాడీ కార్యకర్తలు, ఐసిడిఎస్ సిబ్బంది గ్రామంలో అవగాహన ప్రదర్శన చేశారు.

గణపవరం : అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా గురువారం పిప్పర అంగన్వాడీ కేంద్రంలో బాలికల హక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పిప్పర ఐసిడిఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ సిహెచ్.దుర్గాభావాని మాట్లాడుతూ లింగ వివక్ష అసమానతలు, విద్య ఆరోగ్య సంరక్షణపై బాలికలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కిశోర్ బాలికలు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

భీమవరం టౌన్ : గునుపూడి అంగన్వాడీలో నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో భీమవరం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఒ టి.లక్ష్మీకాంతం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డిసిపిఒ రాజేష్, సూపర్‌వైజర్ సరళ, అంగన్వాడీ టీచర్స్, తల్లులు, కిశోరబాలికలు పాల్గొన్నారు.

యలమంచిలి :మండలంలోని చింతదిబ్బ పంచాయతీ సీతమ్మ చెరువు అంగన్వాడీ కేంద్రం వద్ద గురువారం గ్రామ సర్పంచి చిలుకూరి సునావతి అధ్యక్షతన అంతర్జాతీయ బాలికల దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎసిడిపిఒ నాగరత్నం మాట్లాడుతూ బాల్య వివాహాలు నేరమన్నారు. బాలికలు తీసుకోవాల్సిన వ్యక్తిగత శుభ్రత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు ఎం.ధనలక్ష్మి, వి.శ్రావణిదుర్గ, మహిళ పోలీస్ నాగలక్ష్మి, ఆశా వర్కర్ సంధ్య, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

పెనుమంట్ర : మండలంలోని నెగ్గిపూడి, మార్టేరు, పొలమూరు, పంపనవారిపాలెం, పెనుమంట్ర- 6 అంగన్వాడీ కేంద్రాల్లో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పెనుమంట్ర ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఒ అంగర కృష్ణకుమారి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, తల్లులు, బాలికలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

మావుళ్లమ్మ సన్నిధిలో కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

దుర్గాదేవి అలంకరణలో ఉన్న మావుళ్లమ్మను కలెక్టర్ చదలవాడ నాగరాణి దర్శించుకున్నారు. ఆశీర్వాచన మండపంలో కలెక్టర్‌కు ఆలయ ఇఒ అమ్మవారి శేషవస్త్రాన్ని కప్పారు. ప్రసాదాలను, అమ్మవారి చిత్రపటాన్ని ఆలయ ఇఒ బుద్ధ మహాలక్ష్మి నగేష్ అందించారు.

మావుళ్లమ్మకు 16 గ్రాముల బంగారం విరాళం

మావుళ్లమ్మకు ఈలంపూడికి చెందిన అల్లూరి రవికుమార్‌రాజు, లక్ష్మి దంపతులు 16 గ్రాముల బంగారం కానుకగా అందించారు. గురువారం ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్‌కు ఈ బంగారాన్ని అందించారు.

మద్యం షాపులకు 663 దరఖాస్తులు

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 24 మద్యం షాపులకు గురువారం సాయంత్రం వరకు 663 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ సిఐ ఎస్.రాంబాబు తెలిపారు. ఈ నెల 11 వరకు దరఖాస్తుల స్వీకరణకు గడువు పెంచడంతో దరఖాస్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని చెప్పారు.

పట్టభద్రుల ఓటర్లను చేర్పించండి

తోట సీతారామలక్ష్మి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

టిడిపి భీమవరం నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం భీమవరంలోని నియోజకవర్గ పార్టీ రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తోట సీతారామలక్ష్మి మాట్లాడుతూ త్వరలో ప్రారంభించనున్న టిడిపి సభ్యత్వ నమోదు పునరుద్ధరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, మార్చి 2025లో జరిగే ఉమ్మడి గోదావరి జిల్లాల పట్టభద్రుల శాసనమండలి సభ్యుల ఎన్నికకు డిగ్రీ పూర్తి చేసిన వారిని ఓటరుగా నమోదు నవంబర్ 26వ తేదీలోపు చేర్పించాలని తెలిపారు. టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి మాట్లాడుతూ టిడిపి సభ్యత్వ నమోదులో క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జులు కీలక పాత్ర వహించి అత్యధిక శాతం సభ్యత్వాలు చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు, భీమవరం నియోజవర్గ పరిశీలకుడు రాష్ట్ర కార్యదర్శి దాసరి ఆంజనేయులు, జిల్లా కార్యాలయ కార్యదర్శి ఉప్పులూరు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఉపాధి కోల్పోయిన కార్మికులకు జీవన భృతి ఇవ్వాలి

ప్రజాశక్తి - తణుకు రూరల్

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక ఇసుక లేక ఉపాధి కోల్పోయిన ప్రతి భవన నిర్మాణ కార్మికునికి రూ.పది వేలు జీవనభృతి చెల్లించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక వేల్పూరులోని ప్రజాసంఘాల భవనంలో విశ్వనాథం సుబ్బారావు అధ్యక్షతన సిపిఎం పదో వార్డు శాఖ మహాసభ గురువారం నిర్వహించారు. ఈ మహాసభకు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పివి.ప్రతాప్ హాజరై నివేదికను, సభ్యుల పని పద్ధతులపై సమీక్షించారు. అనంతరం దేశంలో రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న రాజకీయ పరిస్థితులపై మాట్లాడి గ్రామంలో పార్టీ విస్తరణకు పార్టీ సభ్యుల కృషి మరింత పెరగాలన్నారు. స్థానిక సమస్యలపై ప్రజలను సమీకరించి ఉద్యమాలను కొనసాగించాలన్నారు. శాఖా కార్యదర్శిగా మూడో సారి వాసా వెంకటేశ్వరరావు ఎన్నికయ్యారు. ఈ మహాసభలో సిపిఎం గ్రామ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు, రుద్రాక్షల శ్రీనివాసు, తాళ్ల సత్యనారాయణ, అందేకోట బసవయ్య, తాడిశెట్టి అజయ్ పాల్గొన్నారు.

పెనుగొండ :గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని సోమరాజు చెరువు గ్రామంలో తంగెళ్ల శ్రీను అధ్యక్షతన గురువారం సిపిఎం గ్రామ మహాసభ నిర్వహించారు. ఈ మహాసభకు ముఖ్య అతిథిగా హాజరైన సిపిఎం జిల్లా నాయకులు కె.గోపాలన్ మాట్లాడుతూ గత రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలు జరిపినా ఈరోజు వరకు మూడు పంచాయతీలుగా ఉన్న ప్రజల సమస్యలు తామరాడ, కొఠాపర్రు, మునుమర్రు పంచాయతీలకే వెళ్లి పరిష్కరించుకోవాల్సి వస్తుందన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం ఇప్పటికే ఏర్పాటైన గ్రామపంచాయతీకి నూతన కార్యదర్శిని ఏర్పాటు చేసి ప్రజల సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కనీసం ఒక పెన్షన్ దరఖాస్తు పెట్టాలన్నా ఆయా పంచాయతీలకు వెళ్లాల్సిందేనని చెప్పారు. ముందుగా పార్టీ జెండా ఆవిష్కరించారు. ఇటీవల మరణించిన నాయకులకు సభ సంతాపం తెలిపింది. శాఖ కార్యదర్శి నివేదిక ప్రవేశ పెట్టగా సభ్యులు చర్చించి ఆమోదించారు. అనంతరం నూతన శాఖ కార్యదర్శిగా కౌరు జగన్నాథంను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సభలో మండల కార్యదర్శి ఎస్.వెంకటేశ్వం రావు, సభ్యులు పాలా సత్యనారాయణ, కడలి రామ్మూర్తి, దంపనబోయిన సత్యనారాయణ, ఏడుకొండలు పాల్గొన్నారు.

ఎంఎల్‌ఎ రఘురామకృష్ణంరాజు తులాభారం

ప్రజాశక్తి - కాళ్ల

తులాభారం వేయించుకుంటున్న రఘురామకృష్ణంరాజు

ప్రశాంత ఆలయంగా సాయిబాబా ఆలయం ఉందని ఉండి ఎంఎల్‌ఎ కనుమూరు రఘురామకృష్ణంరాజు అన్నారు. సీసలి సాయిబాబాను ఆయన గురువారం దర్శించుకున్నారు. ఆయన చేతులమీదుగా సాయి భక్తులకు వస్త్రాలను అందించారు. పటిక బెల్లంతో తులాభారం తుగారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ రఘురామకృష్ణంరాజు మాట్లాడుతూ సీసలి సాయిబాబా ఛారిటబుల్ ట్రస్ట్ చైర్ పర్సన్ తోరం అనంతలక్ష్మి సత్యదేవి ఆధ్వర్యంలో ప్రతిఏటా దసరా నాడు సాయి భక్తులకు దుస్తులు పంపిణీ చేయడం, షిరిడి మందిరానికి సాయిభక్తుని తీసుకెళ్లడం అభినందనీయమన్నారు. సీసలి సాయిబాబా దేవాలయం తన సేవలకు గానూ మరింత గుర్తింపు ఉందన్నారు. విజయదశమి సందర్భంగా తోట హరిబాబు, తోట ఫణిబాబుల ఆర్థిక సహకారంతో బాబావారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నసమారాధన, గ్రామోత్సవం నిర్వహించారు.

మానసిక రోగులను గౌరవించాలి

ప్రజాశక్తి - తణుకు

ఆలోచనలు, ఆచరణలన్నీ మెదడు పైనే ఆధారపడి ఉంటాయని, మానసిక రోగులను ప్రతిఒక్కరూ గౌరవంగా చూడాలని ప్యానెల్ న్యాయవాదులు కౌరు వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఛైర్మన్, నాలుగో అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి ఆదేశాల మేరకు పాలంగిలో ఉన్న మానసిక వికలాంగుల హోమ్‌లో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్యానెల్ న్యాయవాది ఎ.అజయ్‌కుమార్ మాట్లాడుతూ మానసిక ఒత్తిడి తగ్గించుకోవడం ద్వారా సమాజ, కుటుంబ వికాసం ఏర్పడుతుందన్నారు. అనంతరం వికలాంగుల పిల్లలకు ఉన్న హక్కుల గురించి వివరిస్తూ మాములు పిల్లలకు వర్తించే విధంగా ఆస్తుల్లో సమాన వాటా వస్తుందని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, అర్హత ఉండి ఎవరికైనా పెన్షన్ రాకపోయినా మండల న్యాయ సేవల కమిటీని సంప్రదిస్తే అధికారులతో మాట్లాడి వారికి ప్రభుత్వం నుంచి పెన్షన్ మంజూరు చేయిస్తారన్నారు. ఉచిత న్యాయ సలహాలు అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పారా లీగల్ వాలంటీర్లు డి.బ్రహ్మాజీ, కె.నాగమల్లీశ్వరి పాల్గొన్నారు.

మహారాజశ్రీ నరసాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

E.P. No. 45/2018 in OS. No. 183/2008

Between:

గబ్బిడి స్వామి ...డిక్రీ హోల్డర్స్

Vs

అందే వీర వెంకట రామచంద్రరావు ...జడ్జిమెంట్ డెబ్టార్

టు

అందే వీర వెంకట రామచంద్రరావు
S/o రాఘవరావు, వయసు 45 సం.రాలు
కే.పి.పాలెం, మొగల్తూరు, మొగల్తూరు మండలం.

పై నెంబరు EP గ్రంథములో జడ్జిమెంట్ డెబ్టార్ యొక్క ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని ది. 21-10-2024వ తేదీన ఉ.గం. 10-30 ని.ల లగాయతు పైన తెలిపిన కోర్టు నందు వేలం ద్వారా విక్రయించబడును. కావున కావలసిన వారు వేలంలో పాల్గొని క్రియం పొందగలరు.

షెడ్యూలు

Item.No.1: పశ్చిమ గోదావరి జిల్లా, మొగల్తూరు సబ్-రిజిస్ట్రారులో చేరిన నరసాపురం మండలం, లింగబోయినచర్ల గ్రామం లో గల ఓ.స.నెం.434/8 లో గల య 2.54 సెంట్లు జిరాయతీ మెరక భూమి మరియు ఓ.స.నెం.434/10 లో గల య 60 సెంట్లు జిరాయతీ మెరక భూమి ఏకప్రతిగా ఉన్నందున రెండు ప్రతులు య 3-14 సెంట్లు భూమికి హద్దులు.

తూర్పు : మెరక గాయలు
పడమర : ఉప్పల సత్యనారాయణ గారి భూమి
దక్షిణము : రైతు సేద్యం
ఉత్తరం : గవర్నమెంటు పుంత

అమీనా విలువ Rs. 7,85,000/-
D.H.R విలువ Rs. 8,40,000/-

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

యం. వెంకట రామిరెడ్డి
పాలకొల్లు అడ్వకేటు
ది.8-10-2024 పాలకొల్లు

మహారాజశ్రీ నరసాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో,

Creditor I.P. No. 20/2022

Between:

పిటీషనరు: బొంతు ఆదినారాయణ S/o సత్యనారాయణ, రావిగొప్పు గ్రామం, పోడూరు మండలం, ప.గో.జిల్లా.

రెస్పాండెంట్లు:

R1. జుత్తిగ రుక్మిని, W/o తెలుగురాజు, రాయప్ప నగర్, గుమ్ములూరు గ్రామం, పోడూరు మండలం, ప.గో.జిల్లా.

R2. జుత్తిగ దుర్గా ప్రసాద్, S/o తెలుగురాజు, రాయప్ప నగర్, గుమ్ములూరు గ్రామం, పోడూరు మండలం, ప.గో.జిల్లా.

R3. జుత్తిగ గణేశ్వరరావు, S/o తెలుగురాజు, రాయప్ప నగర్, గుమ్ములూరు గ్రామం, పోడూరు మండలం, ప.గో.జిల్లా.

R4. జుత్తిగ వెంకట సత్యనారాయణ, S/o తెలుగురాజు, రాయప్ప నగర్, గుమ్ములూరు గ్రామం, పోడూరు మండలం, ప.గో.జిల్లా.

R5. సామన వరలక్ష్మి, W/o సత్య జగన్నాధరావు, డోర్ నెం. 51-7-13, రామారావు పేట, పాలకొల్లు, ప.గో.జిల్లా.

R6. ఆఫీసర్ రిసీవర్, పశ్చిమ గోదావరి జిల్లా, ఏలూరు.

పై నెంబరు గ్రంథములో పిటీషనరుకు జుత్తిగ తెలుగురాజు ప్రోనోటు బకాయి ఉన్నందున ఆ ప్రోనోటు బకాయి పరిష్కారం కాకుండా జుత్తిగ తెలుగురాజు 5వ రెస్పాండెంట్ తో కుమ్మకై ది. 24-03-2021 వ తేదీన క్రియ దస్తావేజు నెం. 2133/2021 ను నామమాత్రం గా వ్రాయటం జరిగింది. అయితే జుత్తిగ తెలుగురాజు చనిపోయినందున, రెస్పాండెంట్లు నెం. 1 టు 4 అతని వారసులు అయినందున ది. 24-03-2021 వ తేదీన నామమాత్రంగా వ్రాసిన క్రియ దస్తావేజు నెం. 2133/2021 ను రద్దుచేయవలసినదిగా పిటీషన్‌ను పిటీషనరు కోర్టులో వేసినందున ఈ విషయాన్నీ ఈ ప్రకటన ద్వారా తెలియజేస్తున్నాము.

డి. సుబ్రహ్మణ్యం
వాయిదా తేది: అడ్వకేట్,
28-10-2024 పాలకొల్లు
సెల్: 98491 73674

In The Court Of The Civil Judge (Senior Division) Tanuku

I.P No. 22/2024

Between:

Penugonda Satyanarayana, S/o. Venkateswara Rao, D.No.2-88, Gummampadu Village, Attili Mandal, W.G.District ...*Petitioner*

and

1. Mattu Nagaraju, S/o Kanna Rao, D.No.2-55, Gummampadu Village, Attili Mandal, W.G.District.
2. Allu Srinu, S/o Kanaka Rao, D.No.2-26, Gummampadu Village, Attili Mandal, W.G.District.
3. Marutu Satyam, S/o Notknown, D.No.2-72, Gummampadu Village, Attili Mandal, W.G.District.
4. Yalla Nagaraju, S/o Palla Rao, D.No.2-67, Bank Street, Gummampadu Village, Attili Mandal, W.G.District.
5. Visanasetti Govinda, S/o Appalanaidu, D.No.2-55, Gummampadu Village, Attili Mandal, W.G.District.
6. Mamsamkottu Narsim, S/o Notknown, D.No.2-32, Gummampadu Village, Attili Mandal, W.G.District.
7. Venukonda Pedda Nagayya, S/o Venkatarao, D.No.2-95, Gummampadu Village, Attili Mandal, W.G.District.
8. Voruganti Pitcheswararao, S/o Nageswara rao, D.No.2-55, Chennuru Post, Pedana Mandal, Krishna District.
9. Yerravarapu Apparao, S/o Satyanarayana, D.No.1-77, Gutlapadu Village, Bhimavaram Mandal, W.G.District.
10. Yerravarapu Trimurthulu, S/o Venkata Lingam, D.No.3-96, Padatadiki Village, Kruthivennu Mandal, Krishna District.
11. Barreti Lakshmanna, S/o Notknown, D.No.2-40, Gummampadu Village, Attili Mandal, W.G.District.
12. The Official Receiver, W.G.District., Bhimavaram

GENERAL NOTICE

పై గ్రంథము నందు పిటీషనర్ను ఇన్సాల్వెంట్ గా డి డిక్లేయిర్ చేయమని కోరుచూ పిటీషనరు శ్రీ కోర్టు నందు పై గ్రంథము పిటీషన్ దాఖలు చేసినందున అందు విషయమై ఎవ్వరికి ఎట్టి అభ్యంతరములు ఉన్న యెడల ది. 25-10-2024వ తేదీన ఉదయం 10-30 నిమిషాలకు పై కోర్టు వారి ఎదుట హాజరై వారి అభ్యంతరములు తెలుపుకొవలసినదిగా తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

బేతిరెడ్డి నాగ సృజన
తణుకు పిటీషనర్ తరపు అడ్వకేట్
ది.10-10-2024 సెల్: 81062 77443